- కాంగ్రెస్‌లో మూడు సీట్లపై వీడని పీటముడి
- మరో నాలుగు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ఖరారు
- పోటీకి సిద్ధమంటున్న సీపీఎం
- ఇప్పటికే ప్రచారంలో దూసుకు పోతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- నేడే ఎన్నికల నోటిఫికేషన్.. ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణ

# విపక్షం.. గందరగోళం

## అభ్యర్థులను తేల్చుకోలేక సతమతం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : గత నెల 9న ఎన్నికల షెడ్యూల్ వెలువడగా, నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నది. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈ నెల 5న ఆదివారం మినహా 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. 11, 12 తేదీల్లో రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో 13న నామినేషన్ల పరిశీలన చేపడుతారు. 15వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉండగా, అదే రోజు బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను వెల్లడించనున్నారు. మధ్యలో 14 రోజుల గడువుతో ఈ నెల 30న పోలింగ్ జరుగనున్న విషయం తెలిసిందే.

### నేటికీ గందరగోళంలోనే విపక్షం

అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం ఆది నుంచే స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతుండగా.. విపక్షాలు మాత్రం నేటికీ గందరగోళంతో సతమతమవుతున్నాయి. ఇలాంటి పార్టీలు అధికారంలోకి వచ్చి రాష్ట్రాని ఏలుతాయంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నేతల మధ్య ఆధిపత్య పోరు, టికెట్ల అమ్మకాల ఆరోపణలు, జంప్‌జిలానీలకు టికెట్లు ఇలా ఎన్నెన్నో సిత్రాలకు విపక్షాలు వేదికగా మారాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో నేటికీ కాంగ్రెస్ పార్టీ మరో మూడు స్థానాల్లో అభ్యర్థులను తేల్చలేకపోయింది. సూర్యాపేటలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి మధ్య టికెట్ కోసం హోరాహోరీ నెలకొన్నది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దామోదర్‌రెడ్డి కోసం పట్టుబడితే, రేవంత్‌రెడ్డి రమేశ్‌రెడ్డి కోసం పట్టువీడకుండా ప్రయత్నం చేస్తున్నాడు. తుంగతుర్తిలోనూ సీనియర్ నేత అద్దంకి దయాకర్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డుపడుతుండగా టికెట్‌పై అనిశ్చితి కొనసాగుతున్నది. ఇక మిర్యాలగూడలో పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయించవచ్చని గురువారం వరకూ కొనసాగిన సస్పెన్స్ వీడింది. వామపక్షాలతో పొత్తుపై కాంగ్రెస్ ఎటూ తేల్చకపోవడంతో సీపీఎం పోటీకి సై అంటుంది. దీంతో ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### ఆరు స్థానాల్లో సీపీఎం పోటీ..

ఇక ఇన్నాళ్లు కాంగ్రెస్‌తో పొత్తు కోసం ఎదురుచూసిన వామపక్షాలకు కాంగ్రెస్ మొండిచేయి చూపింది. ముఖ్యంగా సీపీఎం ఇచ్చిన డెడ్‌లైన్ గురువారంతో ముగియడంతో ఆ పార్టీ పోటీకి సిద్ధమైంది. రాష్ట్రంలో 17 స్థానాల్లో పోటీ చేస్తామని, అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్, హుజూర్‌నగర్, కోదాడ, భువనగిరి స్థానాల్లో పోటీకి సిద్ధమని ప్రకటించింది. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఇక సీపీఐ మాత్రం శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో పోటీపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌తో పొత్తు లేకపోతే సీపీఐ కూడా మునుగోడు, దేవరకొండ, ఆలేరులో పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రధాన పార్టీల్లో టికెట్లు రాని ఆశావహులంతా బీఎస్పీ లేదా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బరిలోకి దిగుతున్నారు.

### నాలుగు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ప్రకటన

బీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయం అంటూ గొప్పలకు పోయిన బీజేపీకి చివరకు పోటీ చేసేందుకు కాస్తోకూస్తో బలమైన అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. ఉన్నంతలో బెట్టర్ అభ్యర్థుల కోసం గాలిస్తూ గురువారం మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. నల్లగొండకు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, దేవరకొండకు లాలూనాయక్, హుజూర్‌నగర్‌కు చల్లా శ్రీలతారెడ్డి, ఆలేరుకు పడాల శ్రీనివాస్‌ను ప్రకటించింది. అంతకుముందే సూర్యాపేట, తుంగతుర్తి, నాగార్జునసాగర్‌కు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక మిగిలిన నకిరేకల్, కోదాడ, మిర్యాలగూడ, మునుగోడుకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇందులో పొత్తులో భాగంగా జనసేనకు ఒకటి లేదా రెండు సీట్లు కేటాయించవచ్చని తెలుస్తున్నది. కాగా, ప్రకటించిన సీట్లల్లోనూ టికెట్లు ఆశించిన నేతల్లో అసమ్మతి నెలకొంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రిక్కల ఇంద్రసేనారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. నల్లగొండలోనూ టికెట్టు ఆశించిన కన్నంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

## అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్



నల్లగొండ, నవంబర్ 2 : రాష్ట్ర శాసన సభ ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయించినా, లేదా తరలించినా రాష్ట్ర స్థాయిలో 1800 4252523, జిల్లా స్థాయిలో 08682224271 నంబర్లకు సమాచారం అందించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి జిల్లాలో నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో సమాచారం అందించాలని కోరారు. అలాగే వైన్‌షాప్‌ల ద్వారా కొనుగోలు చేసిన మద్యం సరైనదా కాదా అనేది VERIT మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మద్యం బాటిల్ మూతపై గల హోలోగ్రామ్‌ను స్కాన్ చేయగానే ఆ బాటిల్ బ్రాండ్, పరిమాణం, ఎంఆర్‌పీ, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, ఆ బాటిల్‌ను జారీ చేసిన డిపో, వైన్‌షాప్ పేరు డిస్‌ప్లే అవనున్నట్లు తెలిపారు. ఒకవేళ నకిలీ మద్యం అయితే ఈ వివరాలు ఏవీ కనిపించవని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వెరిట్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌పై ప్రజలు అవగాహన పెంచుకొని అక్రమంగా మద్యం గుర్తిస్తే ఎక్సైజ్ శాఖ ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## జిల్లాకు చేరిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 30న జరుగనున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుండగా ఆయా పార్టీలు, అభ్యర్థుల వ్యయాలను లెక్కించేందుకు ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకుల్లో ఇద్దరు గురువారం సాయంత్రం నల్లగొండ జిల్లాకు చేరుకున్నారు. ఐఆర్‌ఎస్ అధికారులైన డీఎం నిమ్జే, ఎంఆర్ సతీశ్ గురుమూర్తికి జిల్లా అధికారులు స్వాగతం పలికారు. వీరిలో నిమ్జే నాగార్జునసాగర్, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడిగా వ్యవహరించనుండగా, సతీశ్ గురుమూర్తి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. డీఎం నిమ్జేను 8977054651 నంబర్‌లో, ఎంఆర్ సతీశ్ గురుమూర్తిని 8143880650 నంబర్‌లో సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎలక్షన్ స్క్వాడ్ వాహనాలకు | నిఘా నేత్రం

- పైలట్ ప్రాజెక్ట్‌గా చండూరులో ఏర్పాటు

చండూరు, నవంబర్ 2 : అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతి ప్రాంతాన్ని, మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎక్కడైనా, ఏదైనా జరిగితే వెంటనే జిల్లా అధికారుల వరకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు నిఘా నేత్రం(సీసీ కెమెరా) ఏర్పాటు చేశారు. ఈ వాహనం సంచరించేటప్పుడు సీసీ కెమెరాలు 360 డిగ్రీల్లో తిరుగుతూ నిఘా పెడుతాయి. వీటి ద్వారా సేకరించిన ఫుటేజీలను మండల, జిల్లా స్థాయిలో ఉండే అధికారులు తమ కార్యాలయాల్లో వీక్షిస్తారు.





కారుపై అమర్చిన సీసీ కెమెరా

### హైపర్ సెన్సిటివిటీగా గుర్తించడంతో..

గత మునుగోడు ఉప ఎన్నికల నిర్వాహణ అధికారులకు సవాల్‌గా మారింది. దాంతో ఈ సాధారణ ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పక్కా చర్యలు చేపడుతున్నారు. మునుగోడును హైపర్ సెన్సిటివిటీ నియోజకవర్గంగా రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులు గుర్తించారు. జిల్లాకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలాన్ని ఎంపిక చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనానికి 360 డిగ్రీల్లో తిరుగుతూ చిత్రాలు రికార్డు చేసే సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు.

## నామినేషన్లకు శుభ గడియలు

- 4,7,8,9,10 తేదీల్లో మంచి ముహూర్తాలంటున్న పురోహితులు
- ఆయా తేదీల్లో నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

రామగిరి, నవంబర్ 2 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమై ఈ నెల 10వ తేదీన ముగియనున్నది. కాగా, నామినేషన్లు వేసేందుకు 4,7,8,9,10తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు, సిద్ధాంతులు సూచిస్తున్నారు. అయితే మంచి రోజును చూసుకునే అభ్యర్థులంతా నామినేషన్లు వేయనున్నారు. మొదటి రోజు శుక్రవారం అయినప్పటికీ షష్ఠి కావడంతో ఎవరూ నామినేషన్ల వేసేందుకు సుముఖత చూపించకపోవచ్చు. 4న శనివారం సప్తమి ఉంది. 7న మంగళవారం దశమి, 8న బుధవారం దశమి తదుపరి ఏకాదశి వస్తుంది. 9న గురువారం దశమి తదుపరి ఏకాదశి, 10న శుక్రవారం ద్వాదశితో కూడిన ముహూర్తాలున్నాయి. దాంతో అత్యధికంగా 7,8,9 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

### మంచి రోజులే అనుకూలం



నామినేషన్లు వేసేందుకు ఈ నెల 4,7,8,9,10న మంచి రోజులున్నాయి. వీటిలో 4వ తేదీన శనివారం కాబట్టి ఆ రోజు వద్దని కొంత మంది భావించే అవకాశం ఉంది. అత్యంత అనుకూలంగా ఈ నెల 7,8,9,10 తేదీల్లో శుభగడియాలున్నాయి. కాబట్టి ఈ తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసేందేకు ఎంతో అనుకూలంగా ఉంటాయి.

– పెన్నా మోహనశర్మ, ప్రముఖ పురోహితులు, జిల్లా వైదిక బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్